క్లుప్తంగా

భక్తి శ్రద్ధలతో దుర్గా పూజ



పూజల్లో పాల్గొన్న భక్తులు

కర్నూలు కల్చరల్: స్థానిక సూర్యనారాయణ స్వామి ఆలయంలో శుక్రవారం మహా గౌరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాహుకాల, దుర్గా పూజ, లలితా సహస్రనామ పారాయణం తదితర పూజలు భక్తి శ్రద్ధలతో జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.ఆలయం ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

హంస వాహనంపై సీతారాముడు



హంస వాహనంపై విహరిస్తున్న సీతారాముడు

కర్నూలు కల్చరల్: మెయిన్ బజార్ పేట శ్రీ రామాలయం శతాబ్ది బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏడవ రోజు శుక్రవారం ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించారు. మహా నైవేద్యం అనంతరం అన్న సంతర్పణ చేపట్టారు. రాత్రి శ్రీ సీతారామ లక్ష్మణ సహితంగా హంస వాహనంపై పురవీధులలో విహరించారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు అలంరించాయి. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు హనుమేషాచార్య, కమిటీ సభ్యులు మాళిగి వ్యాస రాజ్, మాళిగి పావని, మాళిగి భానుప్రకాష్, కట్టా రాఘవేంద్ర, సత్యనారాయణమూర్తి, మాళిగి విద్యానిధి, ఆచార్య, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఏఐకేఎస్ జాతీయ సమితి సభ్యులు ఎన్నిక



పి. రామచంద్రయ్య



కె.జగన్నాథం

కర్నూలు(సెంట్రల్): ఆల్ ఇండియా కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ సమితి సభ్యులుగా జిల్లాకు చెందిన పి.రామచంద్రయ్య, కె.జగన్నాథం ఎన్నికయ్యారు. ఈ నెల 15, 16, 17 తేదీల్లో నాగపట్నంలో ఏఐకేఎస్ జాతీయ సమితి సమావేశాలు జరిగాయి. ఈ సమావేశాల్లో నూతన కమిటీ ఎన్నుకోగా వారిద్దరిని సభ్యులు ఎన్నుకోవడం హర్షణీయమని సీపీఐ నాయకులు బి.గిడ్డయ్య, మునెప్ప, రామకృష్ణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి

కర్నూలు(సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లా కొండపల్లిలో ఏప్రిల్ 21వ తేదీన జరిగే ఏపీ రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆ సంఘం న్యూసిటీ కార్యదర్శి సి.శేషాద్రి కోరారు. శుక్రవారం మహాసభలకు సంబంధించిన పోస్టర్లను వీరనారి ఐలమ్మ కార్యాలయంలో విడుదల చేశారు.

సీనియర్ సిటిజన్ కార్డులు వినియోగించుకోండి

కర్నూలు (టౌన్): నగరపరిధిలో నివసించే వయోవృద్ధులు సీనియర్ సిటిజన్ కార్డులు తీసుకోవాలని నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 60 ఏళ్ల పైబడిన పురుషులు, 50 ఏళ్ల పైబడిన మహిళలు సీనియర్ సిటిజన్స్‌గా పరిగణించబడతారన్నారు. నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో ఈ కార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఆధార్ కార్డు, పాస్‌పోర్టు సైజ్ ఫొటో రూ. 40 రుసుం చెల్లిస్తే మంజూరు చేస్తారని తెలిపారు. సీనియర్ సిటిజన్ కార్డుల ద్వారా రవాణా సమయంలో, క్యూలైన్‌లు, ఇతరాత్ర సమయాల్లో ఎంతో ఉపయోగపడుతుందన్నారు.

ఐక్య పోరాటాలకు సిద్ధంకండి

కర్నూలు(సెంట్రల్): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండీ అంజిబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం ఏపీ వేర్‌హౌస్ హమాలీ యూనియన్ కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశాన్ని కార్మిక, కర్షక భవన్‌లో నిర్వహించారు. వేర్ హౌస్ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని, ఉద్యోగ భద్రత కోసం పీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాన్ని కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఆర్.నరసింహులు, విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని వ్యక్తి మృతి

జూపాడుబంగ్లా: మండ్లెం సమీపంలో ఉన్న ఎర్రకుంట వాగు ప్రాంతంలో మతిస్థిమితం లేని వ్యక్తి మృతిచెందాడు. ఎస్ఐ లక్ష్మీనారాయణ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన కుమ్మరి చెన్నయ్య(55) మతిస్థిమితం లేక తిరుగుతుండేవాడు. ఆరు రోజుల క్రితం ఇంటి నుంచి వెళ్లిన చెన్నయ్య శుక్రవారం గ్రామానికి సమీపంలో శవమై కనిపించాడు. ఎస్ఐ తన సిబ్బందితో ఘటనా ప్రాంతానికి చేరుకుని విచారించారు. మృతదేహంపై ఉన్న షర్టును గుర్తించి మృతుడు తన భర్తేనని చెన్నయ్య భార్య కుమ్మరి కుర్వమ్మ పోలీసులకు తెలపడంతో మృతదేహాన్ని అప్పగించారు.

మందు బాబులూ.. కాలేయం జాగ్రత్త!

- మద్యంతో ప్రమాదకరమైన లివర్ సిరోసిస్
- జిల్లాలో పెరుగుతున్న కాలేయ బాధితులు
- ఒకవైపు ఫ్యాటీ లివర్, మరోవైపు హెపటైటిస్ వేధింపు
- నేడు ప్రపంచ కాలేయ దినోత్సవం

పెద్దాసుపత్రిలో కాలేయ బాధితుల వివరాలు

సంవత్సరం	కాలేయ బాధితులు	మద్యం తాగి మరణాలు
2020	446	8
2021	940	13
2022	1,062	36
2023	1,303	41
2024	1,450	61
2025	390	16
మొత్తం	10,452	267



పేద, మధ్యతరగతి జీవితాలను మద్యం చిన్నాభిన్నం చేస్తోంది. సరదాగా మొదలయ్యే మద్యపానం క్రమంగా వ్యసనంగా మారుతోంది. చివరికి మద్యం లేనిదే రోజు గడవని పరిస్థితి నెలకొంది. ఈ కారణంగా ఒకవైపు ఆర్థికంగా చితికిపోవడమే గాక మరోవైపు ఆరోగ్యమై గుల్లవుతోంది. ముఖ్యంగా శరీరంలోని కీలక అవయవమైన కాలేయం క్రమంగా దెబ్బతింటూ చివరకు తన వల్ల కాదని చేతులెత్తేస్తోంది. ఈ క్రమంలో మద్యానికి బానిసైన వారికి సిరోసిస్ వచ్చి మృత్యు ఒడి చేరుకుంటున్నాడు. జిల్లాలో ఇలా బానిసలవుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. శనివారం ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– కర్నూలు(హాస్పిటల్)

మద్యపానం అలవాటు కాలేయానికి పెనుముప్పుగా మారింది. మద్యపానంతో గుండె, రక్తనాళాలు, కాలేయం దెబ్బతింటున్నాయి. కొందరిలో బీపీ, షుగర్ వ్యాధులూ వస్తున్నాయి. వైద్యుల వద్దకు కాలేయ సమస్యలతో వస్తున్న వారిలో పాతిక శాతం మద్యపానం చేయడం వల్లేనన్నది స్పష్టం. నాణ్యమైన మద్యం పేరుతో మద్యపాన దుకాణాలు పెంచి విచ్చలవిడిగా మద్యాన్ని సరఫరా చేయడంతో మద్యం సేవించే వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. ఫలితంగా కాలేయ వ్యాధి భారిన పడే వారి సంఖ్య ఎక్కువైంది. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని జీర్ణకోశవ్యాధుల విభాగం (గ్యాస్ట్రో ఎంట్రాలజీ)లో గతంలో వారంలో రెండు రోజులు మాత్రమే ఓపీ నిర్వహించేవారు. రెండేళ్లుగా వైద్యుల సంఖ్య పెరగడంతో ఈ విభాగంలో ప్రతిరోజూ ఓపీ చూస్తున్నారు. ఈ ఆసుపత్రితో పాటు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రులు, క్లినిక్‌లలో ఉన్న గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు, జనరల్ ఫిజీషియన్ల వద్దకు ప్రతిరోజూ 1,200 మంది దాకా వివిధ రకాల జీర్ణకోశ వ్యాధులతో బాధపడే వారు చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 25 శాతం మంది మద్యం సేవించడంతో అనారోగ్యానికి గురై వస్తున్నారు. మరో 10 శాతం మంది ఆహారపు అలవాట్లు, వంశపారంపర్యం, హెపటైటిస్–బి, సి వైరస్ వంటి ఇన్‌ఫెక్షన్ల కారణంగా కాలేయం దెబ్బతిని చికిత్స కోసం వస్తున్నారు.



పెద్దాసుపత్రి జీర్ణకోశ వ్యాధుల విభాగంలో చికిత్స పొందుతున్న రోగులు

పూర్తిగా దెబ్బతినే వరకు పనిచేసే కాలేయం

ప్రతి మనిషిలో కీలక అవయవం కాలేయం. ఇది ముఖ్యమైన, సంక్లిష్టమైన అవయవాల్లో ఒకటి. కాలేయం జీవక్రియ, రోగనిరోధకశక్తి, జీర్ణక్రియ వంటి ప్రక్రియల్లో చురుకుగా పనిచేస్తుంది. సాధారణంగా మనకు ఏ సమస్య వచ్చినా ముందే శరీరం సంకేతాలు ఇస్తుంది. కానీ కాలేయం పూర్తిగా నాశనం అయ్యే వరకు ఎలాంటి సంకేతాలను ఇవ్వదు. ఇక్కడే చాలా మంది నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. తాము బాగున్నామని ఏమీ కాలేదని భ్రమ పడుతుంటున్నారు. కాలేయం పూర్తిగా దెబ్బతిన్నాక జరగాల్సిన నష్టం జరిగిపోయి ఉంటుంది.

కాలేయ వ్యాధులకు దూరంగా ఉండాలంటే...!

- మద్యానికి దూరంగా ఉండాలి. మద్యం కారణంగా కాలేయం దెబ్బతింటుంది.
- అధికంగా కొవ్వు పదార్థాలు, వేపుళ్లు తినకూడదు
- ఉప్పు, చక్కెరల పదార్థాలు ఎక్కువగా తీసుకోవద్దు
- ప్రాసెస్ చేసిన పిండి, ధాన్యాలు తినకూడదు.
- బీఫ్, పంది, మేక (రెడ్‌మీట్) మాంసాలను ఎక్కువగా తినకూడదు.
- ఆకు కూరలు, కూరగాయాలు బాగా తినాలి
- వెల్లుల్లి పాయలు కాలేయాన్ని సంరక్షిస్తాయి. వీటిని తరచూ తీసుకోవాలి
- పసుపు కాలేయానికి మేలు చేస్తుంది. గ్రీన్‌టీ, ఆపిల్ పండ్లు సైతం కాలేయానికి మంచివే.

కాలేయ వ్యాధి లక్షణాలు

కాలేయ వ్యాధిలో ముఖ్యంగా కొన్ని లక్షణాలు కనిపిస్తాయి. కాళ్లు, చీలమండలాల్లో వాపు, ఆకలి లేకపోవడం, వికారం, వాంతులు, జ్వరం, కామెర్లు, కడుపునొప్పి, మూత్రం రంగులో మార్పు, పొట్టుచుట్టూ దురద, ఎరుపు చర్మం, మలంలో రక్తం మొదలైనవి. ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. వ్యాధి ముదిరిన తర్వాత చికిత్స తీసుకునే బదులు ముందుగానే కాలేయంపై దృష్టి సారించి సంరక్షించుకోవాల్సిన అవసరం ఉంది. ఫలితంగా భవిష్యత్‌లో కాలేయ వ్యాదులు రాకుండా చూసుకునే అవకాశం లభిస్తుంది.

పెద్దాసుపత్రిలో ఉచితంగా చికిత్స, మందులు



కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని గ్యాస్ట్రో ఎంట్రాలజి విభాగంలో జీర్ణకోశవ్యాధులు, కాలేయ వ్యాధులకు ఉచితంగా అత్యాధునిక వైద్యపరీక్షలు, మందులు అందిస్తున్నాం. ముఖ్యంగా హెపటైటిస్–బీ, సీ వ్యాధులకు కేంద్ర ప్రభుత్వం అందించే ఖరీదైన మందులను ఉచితంగా ఇస్తున్నాం. ఇటీవల కాలంలో కాలేయ వ్యాధులతో వచ్చే వారి సంఖ్య పెరిగింది.

– డాక్టర్ మోహన్‌రెడ్డి, హెచ్‌వోడి, గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం, జీజీహెచ్, కర్నూలు

ఫ్యాటీ లివర్ కేసులూ పెరుగుతున్నాయి



జంక్‌ఫుడ్, ఫాస్ట్‌ఫుడ్‌లతో పాటు కొవ్వు, చక్కెర అధికంగా ఉండే పదార్థాలు తీసుకోవడం, మద్యం అలవాట్ల కారణంగా కాలేయంపై కొవ్వు పేరుకుంటోంది. దీనిని త్వరగా గుర్తించి చికిత్స తీసుకోవాలి. నిర్లక్ష్యం చేస్తే కాలేయం దెబ్బతినే అవకాశం ఉంది. కొందరికి మద్యం అలవాటు లేకపోయినా కాలేయం దెబ్బతింటుంది. ఇది వారి ఆహారపు అలవాట్లు, వంశపార్యం వల్ల కూడా అయి ఉంటుంది.

– డాక్టర్ పి. అబ్దుల్ సమద్, గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టు, కర్నూలు

ప్రాంతీయ కంటి ఆసుపత్రి సందర్శన

కర్నూలు(హాస్పిటల్): కర్నూలులోని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రిని శుక్రవారం ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ వైద్యబృందం పరిశీలించింది. ప్రస్తుతం ఇక్కడ సేకరిస్తున్న నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో కార్నియా మార్పిడి చేసి ఇతరులకు చూపు ప్రసాదిస్తున్నారు. ఇకపై కర్నూలులోనే కార్నియా మార్పిడి ఆపరేషన్ చేసేందుకు అవసరమైన ఏర్పాట్ల గురించి వైద్యబృందం పర్యటించింది. ఇందులో భాగంగా ఆపరేషన్ థియేటర్, వార్డులు, వైద్యపరికరాలు, ఐ.బ్యాంకును పరిశీలించింది. కార్నియా మార్పిడి చేసేందుకు అవసరమైన అన్ని వసతులు ఉన్నాయని సంతృప్తి వ్యక్తం చేసిన బృందం ఐ బ్యాంకు నిర్వహణపై పెదవి విరిచింది. అక్కడ కనీసం ఫ్యాను కూడా లేదని ఆవేదన వ్యక్తం చేసింది. వెంటనే తగిన ఏర్పాట్లు చేయాలని సూచించింది. బృందంలో ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ చైర్ పర్సన్ డాక్టర్ హరేల్, డాక్టర్ దివ్య ఉన్నారు. వారి వెంట ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పి. వెంకటేశ్వర్లు, డాక్టర్ సత్యనారాయణరెడ్డి, డాక్టర్ యుగంధర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



కంటి ఆసుపత్రిని పరిశీలిస్తున్న ఎల్వీ ప్రసాద్ ఐ బ్యాంకు వైద్యబృందం

ఘనంగా ఏఐబీఈఏ వ్యవస్థాపక వేడుకలు



పోటీల్లో పాల్గొన్న మహిళ బ్యాంకు ఉద్యోగులు

కర్నూలు(అగ్రికల్చర్): బ్యాంకింగ్ రంగంలో అతి పెద్ద ట్రేడ్ యూనియన్ ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయిస్ యూనియన్ (ఏఐబీఈఏ) 80వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు క్లబ్‌లో బ్యాంకు ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఏఐబీఈఏ జిల్లా మొదటి సెక్రటరీ మక్బుల్, విజయ బ్యాంకు పూర్వపు అధ్యక్షుడు ఈశ్వరప్ప ప్రారంభించారు. మహిళ ఉద్యోగులు ఉత్సాహంగా ఆటల పోటీల్లో పాల్గొన్నారు. క్యారమ్స్, చెస్, షటిల్ బ్యాట్మింటన్, లెమన్ అండ్ స్పూన్, మ్యూజికల్ చైర్స్, డ్యాన్స్, పాటలపోటీలు, అంత్యాక్షరి, టగ్ ఆఫ్ వార్ వంటి పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో ఏఐబీఈఏ కర్నూలు శాఖ చైర్మన్ నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి శివకృష్ణ, ఇతర నాయకులు అజయ్, వాసుదేవరెడ్డి, మహిళ నాయకురాలు పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

మానవతా వాది తుమ్మల



తుమ్మల చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న సాహితీ వేత్తలు

కర్నూలు కల్చరల్: అనేక మంది రచయితలను తీర్చిదిద్దిన ఘనత తుమ్మల రామకృష్ణదేనని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కర్నూలు కథా సమయం ఆధ్వర్యంలో సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో శుక్రవారం దివంగత ప్రముఖ రచయిత, ద్రవిడ యూనివర్సిటీ పూర్వపు వైస్ చాన్స్‌లర్ తుమ్మల రామకృష్ణ సంస్మరణ సభ జరిగింది. పలువురు సాహితీ వేత్తలు, రచయితలు, కవులు తుమ్మల చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. గాడిచర్ల ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర, తుమ్మల రామకృష్ణ సోదరులు డాక్టర్ తుమ్మల శ్రీనివాస్, కథా రచయిత ఉమామహేశ్వర్, తెలకపల్లి మధుసూదన శర్మ, వెంకట కృష్ణ, జంధ్యాల రఘుబాబు, నంది అవార్డు గ్రహీత పత్తి ఓబులయ్య, కల్యాణదుర్గం స్వర్ణలత తదితరులు మాట్లాడారు. అధ్యాపకునిగా, ప్రొఫెసర్‌గా అనే మంది విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తును కల్పించారన్నారు. రచయిత డాక్టర్ హరికిషన్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎస్‌డీవీ అజీజ్, మారుతి, చంద్రమౌళిని, వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం

కర్నూలు కల్చరల్: సాహితీ సదస్సు ఆధ్వర్యంలో ఈనెల 20వ తేదీ ఉదయం 10 గంటలకు మద్దూరు నగర్‌లోని పింగళి సూరన తెలుగు తోటలో ఉగాది పురస్కార గ్రహీతలకు సన్మానం ఏర్పాటు చేసినట్లు సాహితీ సదస్సు అధ్యక్షుడు చంద్రశేఖర కల్కూర తెలిపారు. దీంతో పాటు ఆచార్య ఎస్వీ కృష్ణమూర్తిచే స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. విద్వాన్ షేక్ దావూద్ రచించిన 'దాసి పన్నా'పై సాహితీ వేత్త జీఎస్ఆర్కే శర్మ ఉపన్యసిస్తారని తెలిపారు. క్లస్టర్ యూనివర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కట్టా వెంకటేశ్వర్లు, అఖిల భారతీయ బ్రాహ్మణ కరివేన నిత్యాన్నదాన సత్రం కార్యదర్శి డాక్టర్ వేణుగోపాల్ అతిథులుగా హాజరు కానున్నట్లు తెలిపారు.

ఆలయానికి రూ.2 లక్షల విరాళం



నగదును అందజేస్తున్న రైల్వే ఈరన్న

ఆదోని అర్బన్: పట్టణంలోని కోట చంద్రమౌళీశ్వర దేవాలయం అభివృద్ధి కోసం రైల్వే ఈరన్న శుక్రవారం రూ.2 లక్షలు విరాళంగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ ముున్ముందు స్వామివారి ఆలయ అభివృద్ధికి విరాళాలు అందజేసేందుకు కృషి చేస్తామని చెప్పారు. దాతకు, వారి కుటుంబానికి ఆ చంద్రమౌళీశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉండాలని ఆలయ అర్చకులు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రెసిడెంట్ రవి, ఆలయ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ- వ్యర్థాల వినియోగమే మానవాళికి రక్ష

- నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు

కర్నూలు (టౌన్): సమాజంలో పర్యావరణానికి ఈ – వ్యర్థాలు తీవ్ర హాని చేస్తున్నాయని, వాటిని వినియోగించడమే మానవాళి మనుగడకు రక్ష అని నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు అన్నారు. శుక్రవారం స్థానిక పొట్టి శ్రీరాములు చిల్డ్రన్స్ పార్కులో పారిశుద్ధ్య విభాగం సిబ్బందితో సమావేశం నిర్వహించారు.కమిసనర్ మాట్లాడుతూ రోజు రోజుకు సమాజంలో పెరిగిపోతున్న ఎలక్ట్రానిక్ ఉపకరణాల వ్యర్థాలను పూర్తి స్థాయిలో పునఃశుద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. నగరంలోని అన్ని వార్డుల్లో ఈ– వ్యర్థాల కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతయ ఈఈ కిషోర్ రెడ్డి, ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ విశ్వేశ్వర రెడ్డి, గ్రీన్ కో గ్లోబల్ రీసైక్లింగ్ ప్రతినిధులు పవన్, అలోక్, శానిటరీ సూపర్ వైజర్ నాగరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ఎస్. రవీంద్రబాబు

ఘనంగా భంభం స్వామి ఉరుసు

పత్తికొండ రూరల్ : పత్తికొండలోని చెరువుకట్ట కొండపైన వెలసిన శ్రీభంభం స్వామి ఉరుసు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శనివారం జరిగే జియారత్‌తో ఉరుసు ముగుస్తుందని నిర్వాహకులు తెలిపారు. ఉరుసుకు భారీగా తరలివచ్చే భక్తులకు మెరుగైన వసతులు కల్పిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం

కర్నూలు(సెంట్రల్): నూతన వక్ఫ్ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాడతామని సీపీఎం నాయకులు ఎస్ఎండీ షరీఫ్, డి.అబ్దుల్ దేశాయ్ అన్నారు. శుక్రవారం రెండో రోజు సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో మాసుంబాషాదర్గా, లాల్‌మసీదు, బైగన్‌పల్లి హోటల్ మీదుగా కేవీఆర్ గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం ఆర్‌ఎస్‌ఎస్ డైరెక్షన్‌లో ముస్లింలకు సంబంధించిన మదరసాలు, ఖబరాస్థాన్‌లు, మసీదులు, వక్ఫ్ ఆస్తులను తమ వాళ్లకు కట్టబెట్టుకోవాలని చూస్తున్నారన్నారు. అందులో భాగంగానే వక్ఫ్‌కు సవరణ చేశారని విమర్శించారు. అయితే ఈ చట్ట సవరణ రాజ్యాంగ విరుద్ధమని న్యాయ నిపుణులు అభ్యంతరం తెలుపుతున్నా పట్టించుకోకుండా బీజేపీ, దాని మిత్ర పక్షాలైన టీడీపీ, ఆర్‌జేడీలతో ముందుకెళ్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆందోళనలో రాంబాబు, నాగస్వాములు, కేఈ మాదన్న, ఫైరోజు, ఈశ్వర్, ఎం.గిడ్డయ్య, చాంద్‌బాషా, ఇలియాస్, రామ్‌జీ బాషా, రమేష్, అంజి పాల్గొన్నారు.



సేవ్ వక్ఫ్ జేఏసీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బైకును ఢీకొన్న కారు



డోన్ టౌన్: జాతీయ రహదారి దొరపల్లె క్రాస్ వద్ద శుక్రవారం బైకును కారు ఢీకొనడంతో డోన్‌కు చెందిన రవి, జలదుర్గానికి చెందిన ప్రేమ్‌కుమార్‌లు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాలు.. బెంగకూరు నుంచి హైదరాబాద్ వైపు కారు వెళ్తుండగా బాధితులు బైకుపై యు.కొత్తపల్లె దాబా వద్ద టీ తాగి పట్టణంలోకి వస్తుండగా ప్రమాదం చోటుచేసుకుంది. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం డోన్ వైద్యశాలకు తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.



ప్రేమగిరిలో ప్రార్థనలకు హాజరైన క్రైస్తవులు

భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడే



కర్నూలు (టౌన్): క్రైస్తవులు శుక్రవారం భక్తిశ్రద్ధలతో గుడ్‌ఫ్రైడేను జరుపుకున్నారు. ఉదయాన్నే చర్చిలకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఏసు గీతాలను ఆలపించారు. ముఖ్య ప్రసంగీకులు బైబిల్ చదివి వినిపించారు. శిలువ మరణంలో క్రీస్తు పలికిన 7 మాటలను వక్తలు వివరించారు. కర్నూలు నగరంలో కోల్స్ సెంటీనియల్ తెలుగు బాప్టిస్టు చర్చిలో పాస్టర్లు జీవన్‌రావు, రెవరెండ్ అనిల్‌కుమార్, సీఎస్ఐ చర్చిలో పాస్టర్ వరప్రసాదరావు, గిప్సన్ చర్చిలో పాస్టర్ కృపాదానం, స్టాంటన్ మెమోరియల్ చర్చిలో పాస్టర్ దేవసహాయం, పాస్టర్ విక్టర్ ఇమ్మానియేలు, సి. క్యాంపు మందిరంలో పాస్టర్ రెవరెండ్ గంటా కరుణాసాగర్, హొసన్న మందిరంలో పాస్టర్ బ్రదర్ ఫ్రెడ్డీపాల్ దైవసందేశకులు బ్రదర్ సమ్సోనన్న, ఇమ్మానుయేలు చర్చి పాస్టర్ పాల్ ఆగస్టీన్ తదితర చర్చిల్లో ఉదయం నుంచే ప్రార్థనలు ప్రారంభమయ్యాయి. బిషప్ చర్చికి చెందిన సభ్యులు కర్నూలు నగర శివారులోని ప్రేమగిరి వరకు శిలువతో ర్యాలీ నిర్వహించారు. నగరంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డులోని వైఎంసీఏ హాలులో లెమెన్స్ ఇవాలెంజికల్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో గుడ్‌ఫ్రైడే కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. పెద్ద సంఖ్యలో క్రైస్తవులు తరలి వచ్చి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. పాస్టర్ దత్తుబాబు దైవసందేశం వినిపించారు.



ఏసు సందేశాన్ని వినిపిస్తున్న దృశ్యం

ఈరోజు

వీహెచ్‌పీ ధర్నా

కర్నూలు కల్చరల్: పశ్చిమ బెంగాల్లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 10.30 గంటలకు కలెక్టరేట్ సమీపంలోని గాంధీ విగ్రహం వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్లు వీహెచ్‌పీ జిల్లా కార్యదర్శి ఈపూరి నాగరాజు పేర్కొన్నారు. వీహెచ్‌పీ, బజరంగ్ దల్ అనుబంధ సంఘాల నాయకులు, కార్యకర్తలు, హిందువులు అందరూ తరలి రావాలని కోరారు.

స్వచ్ఛాంధ్ర ర్యాలీ

కర్నూలు (టౌన్): స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెల మూడో శనివారం స్వచ్ఛాంధ్ర– స్వరాంధ్ర ర్యాలీ నిర్వహిస్తున్నట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటలకు స్థానిక ఎస్‌బీఐ ఎంప్లాయిస్ కాలనీలోని నూతన కౌన్సిల్ హాలులో మంత్రి టీజీ భరత్, జాయింట్ కలెక్టర్ నవ్య ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని తెలిపారు. అనంతరం అక్కడ నుంచి అశోక్‌నగర్ పంప్ హౌస్ వద్ద ట్రిబుల్ ఆర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.